ఐదు నెలలకే రోడ్లకు పగుళ్లు



2



2

లండన్‌లో యువకుడి మృతి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## ఎన్యూమరేషన్ ఫారాల అందజేత



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ముదక్‌పల్లిలో శుక్రవారం ఎన్యూమరేషన్ ఫాంలను సర్పంచ్ నరేష్ ఆధ్వర్యంలో బీఎల్‌వోలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎల్ఏ, బీఎల్‌వోలు, జీపీవో గున్నం సంతోష్, స్వరూప, రాజాకిషన్, సాయిరెడ్డి, రవి, శ్రీనివాస్, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సెలవు రోజుల్లో స్కూళ్లు తెరిస్తే ఊరుకునేది లేదు..



**అక్షరటుడే, ఇందూరు:** ప్రభుత్వ సెలవురోజుల్లో నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై విద్యాశాఖ అధికారులు వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు శుక్రవారం తెరిచి ఉంచడంతో ఆయా స్కూళ్లకు చేరుకుని బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఇందూర్ విభాగ్ కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ.. లాభార్జనే ధ్యేయంగా కార్పొరేట్ సంస్థలు విద్యాచట్టాలను తుంగలో తొక్కుతున్నాయని మండిపడ్డారు. కనీసం సెలవు రోజుల్లో కూడా విశ్రాంతి లేకుండా తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ వ్యవహారంపై వెంటనే స్పందించాలని, నిబంధనలు ఉల్లంఘించిన కళాశాలలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, మానసిక ఆరోగ్యాన్ని పణంగా పెడితే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, దుర్గ దాస్, గుడ్డు, వీరేష్, నిఖిల్, రాజు, సోరబ్, రాజేష్, కార్తీక్, దినేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.





## బైక్‌ను ఢీకొట్టిన జింక.. దంపతులకు గాయాలు


**అక్షరటుడే, కామారెడ్డి:** అడవిలో ఉండాల్సిన వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ఓ జింక ఏకంగా పట్టణంలోకి వచ్చి బైక్‌ను ఢీకొంది.

### కలెక్టరేట్ నుంచి గ్రామానికి వెళ్తుండగా..

పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలం ఉప్పలవాయి గ్రామానికి చెందిన మేదరి శ్రీనివాస్ తన భార్య గంగామణితో కలిసి కామారెడ్డికి వచ్చాడు. పనులు ముగించుకుని కలెక్టరేట్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా పక్క నుంచి ఒక్కసారిగా వచ్చిన జింక స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భర్తకు కాలు విరగగా భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

**రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం తీవ్ర సమస్యగా మారింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.**

- అక్షరటుడే, కామారెడ్డి/ఇందూరు




# విద్యార్థులపై ఫీజు భారం

■ మూడేళ్లుగా పెండింగ్‌లోనే బకాయిలు ■ సర్టిఫికెట్ల కోసం విద్యార్థులకు తప్పని తిప్పలు ■ నిర్వహణ భారం అవుతుందంటున్న యాజమాన్యాలు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 65 డిగ్రీ, పీజీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో సుమారుగా ఏటా 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అంటే మూడేళ్లుగా 90 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం వీరి పరిస్థితి అడకత్తెరలో పోక చెక్కలా మారింది. అటు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ ఇవ్వక, ఇటు కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వక ఇబ్బందుల్లో ఉన్నారు.

### రూ.300 కోట్లు

ఉమ్మడి జిల్లాలోని కాలేజీలకు దాదాపు రూ.300 కోట్లు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయి ఉంది. దాంతో ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేయడానికి ఆలోచిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ విషయమై న్యాయస్థానం సైతం కళాశాలలకు అనుకూలంగా స్టే ఇచ్చింది. ఇప్పటివరకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందనే భరోసాతో ఉన్న విద్యార్థులు ఇప్పుడు ఒక్కసారిగా వేల రూపాయలు కట్టాల్సి వస్తోంది. మొదటి సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులపై భారం పెరగనుంది.

### నిర్వహణ భారం

కళాశాల యాజమాన్యాలు సైతం బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందుల్లో ఉన్నాయనేది వాస్తవం. ప్రభుత్వం నుంచి నిధులు రాక అధ్యాపకులకు జీతాలు, కళాశాల నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని యాజమాన్యాలు వాపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఘం నేతలు తెలిపారు. పలు దఫాలుగా ప్రభుత్వానికి విన్నవిస్తున్నప్పటికి నిధులు విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

### నిధులు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఉద్దేశం నెరవేరడం లేదని, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు, తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజులు చెల్లించలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతంగా మారుతుందని, పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకముందే ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

### ఫీజు బకాయిలు త్వరగా విడుదల చేయాలి



ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలలకు రావాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ప్రభుత్వం తొందరగా విడుదల చేయాలి. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఫీజు చెల్లించే పరిస్థితి లేదు. ప్రభుత్వం చెప్పినట్టుగా ఆగస్టు 15 వరకు అంటే విద్యార్థులు వెళ్లిపోతారు. అప్పుడు విద్యార్థులను ఫీజు అడిగే పరిస్థితి ఉండదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారుగా రూ.300 కోట్ల బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వాటిని ప్రభుత్వం తక్షణమే విడుదల చేస్తే మాకు ఉపశమనం లభిస్తుంది. కోర్టు ఆదేశాలపై ఈ నెల 29 న రాష్ట్రస్థాయిలో సమావేశం ఉంది. ఆ తర్వాత ఎలా ముందుకు వెళ్లాలనేది రాష్ట్ర నాయకత్వం నిర్ణయిస్తుంది.

– జైపాల్ రెడ్డి, ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు





## పార్క్ చేసిన బైక్‌కు హెల్మెట్ లేదంటూ ఫైన్..

**అక్షరటుడే, కామారెడ్డి:** బైక్ ఇంట్లో పార్క్ చేసి ఉంచితే హెల్మెట్ లేదంటూ ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేశారు. దేవునిపల్లి గ్రామానికి చెందిన మహేష్కర్ రాజు పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలో సబ్ స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో బైక్ పార్క్ చేశాడు. ఆ సమయంలో మద్నూర్ శివారులో అతనికి హెల్మెట్ లేదని రూ.235 జరిమానా విధించినట్టు ఫోన్‌కు మెసేజ్ రావడంతో ఖంగుతిన్నాడు. తాను ఉన్నది కామారెడ్డిలో అయితే మద్నూర్‌లో ఎలా ఫైన్ వేశారు అని ఆశ్చర్యానికి గురయ్యాడు. అయితే అతడి నంబర్ ప్లేట్‌ను మరో వ్యక్తి అమర్చుకున్నాడు. దీంతో అతడికి వెళ్లాల్సిన ఫైన్ రాజుకు వచ్చింది.



## ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా బొబ్బిలి వేణుగోపాల్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో 21 జిల్లాలకు సంబంధించి బీజేపీ ఓబీసీ అధ్యక్షులను నియమించారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా ఓబీసీ అధ్యక్షుడిగా బొబ్బిలి వేణుగోపాల్ నియమితులయ్యారు. నగరంలో సీనియర్ నాయకుడిగా సేవలందిస్తున్న ఆయనను అధిష్టానం గుర్తించి ఈ పదవిని కట్టబెట్టింది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. పార్టీ తన సేవలను గుర్తించి పదవి ఇచ్చిందని.. శాయశక్తులా ఈ పదవికి న్యాయం చేస్తానన్నారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్తామని జిల్లాలోని ఓబీసీలను కలుపుకుని ముందుకు వెళ్తానని ఆయన తెలిపారు.

## ఉత్సాహంగా 2కే రన్..







**అక్షరటుడే, మెండోరా:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా జిల్లాలోని మెండోరా, ఆర్మూర్‌లతో వివిధ పట్టణాల్లో పరిధిలో 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

### పోచంపాడ్ గ్రామం నుంచి ఎక్స్ రోడ్ వరకు..

పోచంపాడ్ గ్రామం నుంచి పోచంపాడ్ ఎక్స్‌రోడ్ వరకు శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెండోరా ఎస్సై సుహాసిని మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత జీవితాన్ని నాశనం చేస్తాయన్నారు. మాదకద్రవ్యాలకు బానిసైన వారు తమ భవిష్యత్తుతో పాటు కుటుంబం, సమాజానికీ నష్టం కలిగిస్తారని వివరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, జీవిత లక్ష్యాలపై దృష్టి సారించాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, గ్రామస్తులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాల్కొండ ఎస్సై శైలేందర్, ముప్కాల్ ఎస్సై కిరణ్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలో 2కే రన్ నిర్వహించగా ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డ్రగ్స్ విషయమై యువత, విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని.. లేదా డీఅడిక్షన్ సెంటర్‌లో చేర్పించి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్: పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పట్టణంలోని తన నివాసంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన 51 మంది లబ్ధిదారులకు రూ.14.43 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. బాన్సువాడ మండలంలో ఎనిమిది మందికి రూ. 2.25 లక్షలు, బీర్కూర్ మండలంలో నలుగురికి రూ.75,500, నస్రుల్లాబాద్ మండలంలో 8మందికి రూ.1.59 లక్షలు, మోస్రా మండలంలో ఇద్దరికి రూ.28,000, చందూర్ మండలంలో నలుగురికి రూ.1.22 లక్షల చెక్కులను అందజేశారు. అలాగే వర్ని మండలంలో ఐదుగురికి రూ.1.57 లక్షలు, రుద్రూర్ మండలంలో నలుగురికి రూ.1.56 లక్షలు, కోటగిరి మండలంలో ఆరుగురికి రూ.2.52 లక్షలు, పోతంగల్ మండలంలో తొమ్మిది మందికి రూ.2.54 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలివ్వాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేయాలని నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్ సూచించారు. మండలంలోని మెంట్రాజ్‌పల్లిలో పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీని పరిశీలించారు. తహశీల్దార్ సతీష్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైనన్ని ఫారాలు ఇవ్వాలని, ఓటరు పేరు, ఇంటి నంబర్, మొబైల్ నంబర్ వంటి వివరాలను నిర్ధారించుకుని ఫారాలు అందజేయాలని ఆర్డీవో సూచించారు. ఫారం ఎలా నింపాలో ఓటరుకు స్పష్టంగా వివరించాలని, అవసరమైన ధ్రువపత్రాలు జత చేయాలని సిబ్బందికి ఆర్డీవో రాజేంద్రకుమార్ వివరించారు. ఇంట్లో ఎవరూ లేకపోతే పొరుగువారి ద్వారా సమాచారం ఇచ్చి, మళ్లీ వెళ్లి ఫారం అందజేయాలని, పంపిణీ చేసిన ప్రతి ఫారం వివరాలను నిర్దేశిత రిజిస్టర్/యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచి, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అవసరాలకే ఉపయోగించాలన్నారు. ఈ సూచనలు పాటించడం ద్వారా 'సర్' ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తవుతుందని పేర్కొన్నారు.



## సమగ్ర ఓటరు సవరణ జాబితాపై ప్రజలకు అవగాహన ఉండాలి

**అక్షరటుడే, ఇందూరు:** సమగ్ర ఓటరు సవరణ జాబితాపై ప్రజలకు అవగాహన ఉండాలని 21వ డివిజన్ కార్పొరేటర్ పంచరెడ్డి లలిత చరణ్ అన్నారు. 'సర్' సమగ్ర ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియలో భాగంగా డివిజన్‌లో సర్వే నిర్వహించారు. నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో కలిసి డివిజన్‌లో కార్పొరేటర్ సర్ ప్రక్రియలో భాగంగా సీనియర్ అడ్వకేట్ కృపాకర్ రెడ్డికి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేశారు. అనంతరం కార్పొరేటర్ పంచ రెడ్డి లలిత చరణ్ మాట్లాడుతూ.. 'సర్' ప్రక్రియ పట్ల ప్రజలు అప్రమత్తతో అవగాహనతో ఉండాలన్నారు. లేని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, ఓటు ఉంటేనే ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకానికి మనం అర్హులం అవుతామన్నారు. డివిజన్ ప్రజలందరూ వారి వారి వివరాలను 'సర్' ప్రక్రియలో భాగంగా వచ్చే అధికారులకు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ ప్రత్యేక అధికారి ప్రశాంత్, వార్డ్ ఆఫీసర్ ఐశ్వర్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షోయబ్, డివిజన్ బూత్ లెవెల్ ఆఫీసర్స్, డివిజన్ జవాన్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే, భీమ్‌గల్(కమ్మర్‌పల్లి):** మూర్ఛ వ్యాధితో మనోవేదనకు గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండల పరిధిలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. కమ్మర్‌పల్లి ఎస్సై సీహెచ్ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన అశోక్ గత కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. వివిధ ఆస్పత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యేవాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు సైతం చుట్టుముట్టాయి. రెండు నెలలుగా ఎలాంటి పనికి వెళ్లకుండా రోజంతా మద్యం తాగుతుండడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన అశోక్.. శుక్రవారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు బయట నిద్రిస్తున్న సమయంలో గదిలోకి వెళ్లి చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. ఉదయం 6:20 గంటల ప్రాంతంలో భార్య సంధ్య లోపలికి వెళ్లి చూసేసరికి అశోక్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కిందకు దించినప్పటికీ అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమ్మర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో రూ.కోట్ల ప్రజాధనంతో కొత్తగా వేసిన బీటీ రోడ్లు ఐదు నెలలు కూడా కాకముందే అధ్వానంగా తయారయ్యాయి. పట్టణంలోని పలు కాలనీల్లో రోడ్లు పూర్తిగా దెబ్బతిని, గుంతలమయం కావడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, ఇష్టారాజ్యంగా పనులు చేయడమే ఈ దుస్థితికి కారణమని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అక్షరటుడే, ఆర్మూర్

# ఐదు నెలలకే రోడ్లకు పగుళ్లు..

■ రూ.కోట్ల ప్రజాధనం వృథా ■ నాణ్యతను గాలికొదిలేసిన కాంట్రాక్టర్లు
■ అధికారుల పర్యవేక్షణ శూన్యం ■ బీటీ రోడ్ల దుస్థితిపై మండిపడుతున్న పట్టణ ప్రజలు

ఆర్మూర్ పట్టణంలో 36 వార్డులు ఉన్నాయి. సుమారు 80వేల పైచిలుకు జనాభా ఉంది. అయితే పట్టణాభివృద్ధి కోసం రూ.18కోట్లు విడుదల అయ్యాయి. ఈ నిధులతో వరద కాల్వలు, బీటీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు ప్రణాళికలు వేశారు. దీంట్లో హౌసింగ్ బోర్డు, పెర్కిట్, మహాలక్ష్మి కాలనీ, అంగడి బజార్, మామిడిపల్లి, జర్నలిస్ట్ కాలనీ, కింది బజార్, మీది బజార్, ఆలూరు రోడ్డు, జిరాయత్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో కొత్త రోడ్లు పూర్తిగా పగుల్లిచ్చాయి. చిన్నపాటి వర్షానికే తారు లేచిపోయి కంకర తేలుతోంది.

### తరచూ ప్రమాదాలు..

ఈ గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనాలు బోల్తా పడుతుండగా.. వృద్ధులు, మహిళలు నడవడానికి కూడా భయపడుతున్నారు. రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే ఈ రోడ్ల పరిస్థితి మరెంత దారుణంగా మారుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### నిబంధనలు 'బేఖాతర్'.. అధికారుల నిర్లక్ష్యం

మున్సిపల్ నిబంధనల ప్రకారం.. కొత్తగా వేసిన బీటీ రోడ్డు కనీసం ఐదేళ్ల పాటు చెక్కుచెదరకుండా ఉండాలి. కానీ, ఆర్మూర్‌లో మాత్రం ఐదు నెలలకే రోడ్లు పగుళ్లు ఏర్పడ్డాయి. కాంట్రాక్టర్లు నాసిరకం మెటీరియల్ వాడటం, సరైన పద్ధతిలో రోలింగ్ చేయకపోవడమే ఇందుకు కారణమని ఇంజినీరింగ్ నిపుణులు సైతం అభిప్రాయపడుతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో మున్సిపల్ అధికారులు పర్యవేక్షించకపోవడం వల్లే కాంట్రాక్టర్లు ఇంతలా తెగించారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



### నాసిరకం రోడ్లు వేసిన కాంట్రాక్టర్లను..

నాసిరకం రోడ్లు వేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కాంట్రాక్టర్‌పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, సదరు సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆయా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. దెబ్బతిన్న రోడ్లను కాంట్రాక్టర్‌తో తిరిగి వేయించాలని కోరుతున్నారు.

### బీటీ రోడ్లలో నాణ్యత కరువైంది..

ఇటీవల మున్సిపల్ ఎన్నికల సమయంలో వేసిన బీటీ రోడ్లు ఐదు నెలల వ్యవధిలోనే గుంతలమయంగా మారాయి. పలు కాలనీల్లో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, తూతూమంత్రంగా తారురోడ్లు వేసి చేతులు దులుపుకున్నారు. రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేసిన కాంట్రాక్టర్లు, ఇందుకు సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి.

– పూజా నరేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, ఆర్మూర్



## పోగొట్టుకున్న సెల్ ఫోన్ల రికవరీ

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అధికారి చేసినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఇందులో రెండు ఫోన్లు ఏడాదికితం పోగొట్టుకోగా, మరో నాలుగు ఫోన్లు నెలల వ్యవధిలో చోరీకి గురయ్యాయి. ఫిర్యాదుల మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్లన్నీ రికవరీ చేసి బాధితులైన భువనేశ్వర్, షాబాజ్ షేక్, నాగం నవీన్, జనార్ధన్ గీత, సట్ల గంగ సాయన్న, రవితేజ రామగిరిలకు ఫోన్లను అందజేసినట్లు ఆయన తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో మొహర్రం



నగరంలో మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లను అందంగా ముస్తాబు చేసి కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు. మిర్చికంపౌండ్, కోటగల్లీలలో ఈ కార్యక్రమం నిర్వహించగా.. పలువురు మొక్కులు తీర్చుకున్నారు. – అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్



## కేజ్‌వీల్స్‌తో రోడ్లు ఛిద్రం.. స్పందించని అధికారులు

**వ్యవసాయ సీజన్‌లో వరినాట్ల కోసం ఉపయోగించే ట్రాక్టర్ కేజ్ వీల్స్ (దమ్ము చక్రాలు) కారణంగా గ్రామీణ, ప్రధాన రహదారులు తీవ్రంగా ఛిద్రమవుతున్నాయి. వరినాట్ల కోసం రైతులు కేజ్‌వీల్స్‌తో పొలాలను సిద్ధం చేస్తారు. అయితే వీటికి పట్టీలు బిగించకుండా.. నేరుగా తారు రోడ్లపైకి తీసుకురావడం వల్ల రూ.కోట్లు వెచ్చించి వేసిన రోడ్లు బుగ్గిపాలవుతున్నాయి. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులు సైతం ఎలాంటి అవగాహన కల్పించడం లేదు. దీంతో రోడ్లు పాడవుతున్నాయి. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై గుంతలు ఏర్పడి బైక్‌లు నడిపేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కంజర్–కులాస్‌పూర్ రోడ్ కేజ్‌వీల్స్ కారణంగా పూర్తిగా పాడైపోయింది.**

– అక్షరటుడే, నెట్‌వర్క్

## డీవీ కృష్ణ విగ్రహానికి నివాళులు



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో కామ్రేడ్ డీవీ కృష్ణ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సీపీఐఎంఎల్ మాస్ లైన్ సెక్రటేరియట్ రాష్ట్ర సభ్యుడు ప్రభాకర్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి దేవారాం అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ డీవీ కృష్ణ ప్రభుత్వ ఉద్యోగాన్ని సైతం వదిలి ఉద్యమం కోసం జీవితాంతం అంకితభావంతో పనిచేశారన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తోటి సహచరులంతా బూటకపు ఎన్కౌంటర్లలో మృతి చెందుతున్నప్పటికీ ఉద్యమం కోసం పోరాడారన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విప్లవ ఉద్యమాన్ని మార్చుకుంటూ అణగారిన వర్గాల కోసం పోరాటం చేశాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ముత్తెన్న, సీనియర్ జర్నలిస్ట్ కొంగర శ్రీనివాస్, ఎస్ సురేష్, జి కిషన్, కె రాజేశ్వర్, బి కిషన్, నరేందర్, రాజన్న, నడిపన్న, అరవింద్, లక్ష్మి, పద్మ, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలి: మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ఎస్ఐఆర్ సర్వేలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో బీఎల్‌వోల నుంచి ఎన్యూమరేషన్ పత్రాలను బిగాల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన ఓటరు తమకు అందిన ఎన్యూమరేషన్ పత్రాన్ని పూర్తిగా, సరైన వివరాలతో నింపి, అవసరమైన ధ్రువపత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సంబంధిత బీఎల్‌వోల లేదా ఎన్నికల అధికారులకు అందజేయాలని కోరారు. ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని మాజీ ఎమ్మెల్యే అన్నారు. చిన్న నిర్లక్ష్యం వల్ల భవిష్యత్తులో ఓటు నమోదు, సవరణ లేదా ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అందువల్ల ప్రతి కుటుంబం ఈ ప్రక్రియను సీరియస్‌గా తీసుకుని, ఇంట్లోని ప్రతి అర్హత కలిగిన ఓటరుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయించాలని సూచించారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ ప్రజలందరూ ఎన్నికల సంఘానికి సహకరిస్తూ ఈ సర్వేను విజయవంతం చేయాలని, అలాగే తమ బంధువులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఎన్యూమరేషన్ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించేలా సహకరించాలని మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల విజ్ఞప్తి చేశారు.

## బర్త్ డే పార్టీకి వెళ్లిన యువకుడి మృతి.. లండన్‌లో ఘటన



**అక్షరటుడే, కామారెడ్డి:** స్నేహితుడి వద్దకు బర్త్ డే పార్టీకి వెళ్లిన ఓ యువకుడు అతని గదిలోనే తెల్లారేసరికి విగతజీవిగా మారాడు. ఈ ఘటన లండన్‌లో రెండు రోజుల క్రితం చోటుచేసుకుంది. రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన శ్రీనాథ్ రెడ్డి(25) ఉన్నత చదువుల కోసం 14 నెలల క్రితం లండన్ వెళ్లాడు. ప్రస్తుతం లీసెస్టర్ పట్టణంలోని యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్న శ్రీనాథ్ రెడ్డి, మంగళవారం రాత్రి స్నేహితుడి బర్త్‌డే పార్టీకి వెళ్లాడు. అనంతరం అదే అతడి రూమ్‌లో నిద్రించాడు. ఉదయం స్నేహితుడు వచ్చి చూసేసరికి శ్రీనాథ్ రెడ్డి విగతజీవిగా కనిపించాడు. వెంటనే స్నేహితులు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. తలమడ్ల గ్రామానికి చెందిన మధుసూదన్ రెడ్డిమంజుల దంపతులు తమ కుమారుడు ఉన్నత చదువులు పూర్తిచేసుకుని మంచి ఉద్యోగం సాధిస్తాడని ఆశించారు. అయితే ఆ తల్లిదండ్రులకు అతని మరణం తీరని దుఃఖాన్ని మిగిల్చింది. శ్రీనాథ్ రెడ్డి మృతితో తలమడ్ల గ్రామంలో, కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## చేనేత ఐక్య వేదిక కార్యదర్శిగా జగదీశ్వర్

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన లోలం జగదీశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా పద్మశాలి సంఘ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జు దత్తాద్రి నియామకపత్రాన్ని జగదీశ్వర్‌కు అందజేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా జగదీశ్వర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి హాస్టల్ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, జిల్లా పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్గం హన్మాండ్లు, పద్మశాలి ఆత్మీయ సేవా సమితి అధ్యక్షుడు రాపెల్లి గురుచరణ్, చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు తన్నీరు వాసు, జిల్లా పద్మశాలి సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతల గంగాదాస్, తదితరులు పాల్గొన్నారు.

